13-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - దేహ సహితంగా అన్నింటినీ మరచి పూర్తిగా బెగ్గర్లుగా అవ్వండి, శివపురి మరియు విష్ణుపురితో మీ బుద్ధియోగాన్ని జోడించండి"

ప్రశ్న:- ఏ విషయములో పిల్లలైన మీరు తండ్రి సమానముగా ఉదారచిత్తులుగా అవ్వాలి?

జవాబు:- ఏ విధముగా బాబా ఉదారచిత్తులుగా అయి పిల్లలైన మీ నుండి పనికిరానివి తీసుకొని మీకు విశ్వ రాజ్యాధికారాన్ని ఇస్తారో, అలాగే మీరు కూడా ఉదారచిత్తులుగా అవ్వాలి. అన్ని స్థానాలలో ఈశ్వరీయ విశ్వవిద్యాలయాలను తెరవండి. ముగ్గురు-నలుగురు మంచి పదవిని పొందినా అది అహో సౌభాగ్యమే. సుపుత్రులుగా అయి సద్గురువును ప్రత్యక్షము చేయండి. ఎప్పుడూ ఎవరి నుండి ధనం మొదలైనవి అడగకండి.

పాట:- బాల్యపు రోజులను మరచిపోకండి... (బచ్పన్ కే దిన్ భులా న దేనా...)

ఓం శాంతి. పిల్లలను ఆహ్లాదపరిచేందుకే ఈ గీతాలన్నీ ఉన్నాయి. బాప్ దాదా మరియు మమ్మా ఉన్నారు. తల్లులు ఇద్దరు ఉంటారు. ఒకరు దాది (నానమ్మ), ఇంకొకరు అమ్మ. వీరు మీ దాది కూడా. మీరు బ్రహ్మకు కుమార్తెలు మరియు శివునికి మనుమరాళ్ళు. మమ్మా కూడా బ్రహ్మకు కుమార్తె అయిన సరస్వతి, ఆమె శివబాబాకు మనుమరాలు. పిల్లలను సంభాళించేందుకు జగదాంబ నిమిత్తమై ఉన్నారు. శివబాబా బహురూపి. వారు ఎన్నో ఆటపాటలు చేస్తూ ఉంటారు. వేడుకలు ఉంటాయి కదా. నిశ్చితార్థము జరిగేటప్పుడు ఎంతో వేడుకలా జరుపుకుంటారు మరియు ఎప్పుడైతే వివాహ సమయం వస్తుందో, అప్పుడు ఇరువురూ చినిగిపోయిన వస్త్రాలను ధరిస్తారు, వారికి నూనె రాస్తారు. ఈ ఆచారము కూడా ఇక్కడిదే. కావున పిల్లలైన మీకు కూడా బాబా అర్థం చేయిస్తారు - పూర్తిగా బెగ్గర్లుగా అవ్వాలి. ఏమీ లేకుండా ఉంటే అన్నీ లభిస్తాయి. దేహ సహితంగా ఏమీ ఉండకూడదు. శివపురి, విష్ణుపురి వైపే బుద్ధియోగాన్ని జోడించాలి. ఇంకే వస్తువు పట్ల అభిరుచి ఉండకూడదు. బాబా పిల్లలను ఎలా ఆహ్లాదపరుస్తారో చూడండి. ఇవి కూడా బాబా తెలిపే అనేక రహస్యాలు. మీరాకు ఎంత గాయనము ఉందో చూడండి. కేవలం ఈ ఒక్క పవిత్రత కారణముగానే తాను పరువు-మర్యాదలను పోగొట్టుకున్నారు. ఆ తర్వాత ఎంత పేరు వచ్చింది. ఆమెకైతే అమృతము కూడా లభించలేదు. కేవలం శ్రీకృష్ణునిపై ప్రీతి ఉండేది. శ్రీకృష్ణపురిలోకి వెళ్తాను అని భావించారు, అందుకే విషాన్ని వదిలేసారు. ఏ విధముగా పతి వెనుక భార్య సతీ సహగమనము చేస్తుంది కదా. అలాగని మీరా స్మృతి చేస్తూ-చేస్తూ కృష్ణపురిలోకి వెళ్ళారని కాదు. మీరా వచ్చి 5-7 వందల సంవత్సరాలు అయి ఉంటుంది. ఆమె చాలా మంచి భక్తురాలు, అందుకే ఎవరైనా మంచి భక్తుని ఇంట్లో జన్మ తీసుకొని ఉంటారు. ఆమె పేరు ఎంతగా ప్రఖ్యాతి చెందింది. ఆమె భక్తురాలు అయిన మీరా, మీరు సత్యమైన జ్ఞాన మీరాలుగా అవుతారు. మీరు సూర్యవంశీ, చంద్రవంశీ మహారాణులుగా అయ్యేందుకే వచ్చారు. ఇంతకుముందు చదువుకోనివారు చదువుకున్నవారి ముందు తలవంచినా కానీ, వారు మహారాణులుగా అయితే అవుతారు కదా. ఒకవేళ బాల్యాన్ని మరచి చేతిని విడిచిపెట్టేస్తే ఇక ఎప్పటికీ మహారాణిగా అవ్వరు, అంతేకాక ప్రజలలో కూడా తక్కువ పదవిని పొందుతారు. వైకుంఠములోకి వస్తారు కానీ తక్కువ పదవిని పొందుతారు. బాబా అర్థం చేయించారు, భక్తి చేసేవారిని కూడా అడగాలి - మీకు ఏమి కావాలి, శ్రీకృష్ణుని భక్తిని ఎందుకు చేస్తున్నారు? అతని రాజధానిలోకి వెళ్ళాలి అని తప్పకుండా మనస్సులో ఉంటుంది కానీ అక్కడకు ఎలా వెళ్తారు? చాలామంది మనుష్యులు - మాకు శాంతి కావాలి అని అంటారు. కానీ అశాంతి అయితే మొత్తం ప్రపంచమంతటిలోనూ ఉంది కదా. మరి మీ ఒక్కరికే శాంతి లభించడం వల్ల ఏమవుతుంది. మేము మిమ్మల్ని 21 జన్మల కొరకు సదా సుఖవంతులుగా చేయగలము. దేవతలు ఈ భారత్ లోనే సదా సుఖవంతులుగా ఉండేవారు. ఇప్పుడు ఆ రాజధాని స్థాపన అవుతోంది. ఇక్కడ ఉన్నది మాయ రాజ్యమే. ఇక్కడ శాంతి లభించదు. శాంతి కొరకు వేరే స్థానము ఉంది, సుఖము కొరకు వేరే స్థానము ఉంది. సుఖధామము అనగా అక్కడ అందరూ సుఖవంతులుగా ఉంటారు, దుఃఖితులు ఒక్కరు కూడా ఉండరు మరియు దుఃఖధామములో సుఖవంతులు ఒక్కరు కూడా ఉండరు. యథా రాజా రాణి తథా ప్రజా, ఇక్కడ అందరూ ఎంతో దుఃఖితులుగా ఉన్నారు. సుఖధామములో జంతువులు కూడా ఎప్పుడూ దుఃఖితమవ్వవు. శాంతి ప్రపంచము పేరు, దానిని నిర్వాణధామము అని అంటారు. బుద్ధుడు నిర్వాణము చెందారు అని అంటారు. కానీ నిజానికి ఎవ్వరూ వెళ్ళలేదు. ఒకవేళ వారు స్వయం వెళ్ళిపోయినట్లయితే మరి ఏమి చేసి వెళ్ళారు. అందరూ ఎంతో దుఃఖితులుగా ఉన్నారు. అందరూ పోట్లాడుకుంటున్నారు. బర్మా, సిలోన్ బౌద్ధులది. వారు కూడా హిందువులు

బయటకు వెళ్ళిపోవాలి అని అంటూ ఉంటారు, సహించలేరు. అనేక ధర్మాలు ఏర్పడ్డాయి కావున సహించలేకపోతున్నారు అని బాబా కూడా గమనిస్తారు, అందుకే అందరినీ పూర్తిగా బయటకు పంపించివేస్తారు. సత్యయుగములో కేవలం ఒకే ధర్మం ఉంటుంది. ఈ జ్ఞానమంతా పిల్లలైన మీ బుద్ధిలో ఉంది. చిత్రాలను చేతిలోకి తీసుకొని వానప్రస్థులకు సేవ చేయాలి. మందిరాలలోకి దూరిపోవాలి. వెళ్ళి వారితో చిట్-చాట్ చేయాలి. శంకరుని ఎదురుగా శివలింగాన్ని చూపిస్తారు, అంటే తప్పకుండా వారు శంకరుని కన్నా పెద్దయే కదా! ఒకవేళ శంకరుడే భగవంతుని రూపమైనట్లయితే మరి వారి ముందు శివలింగాన్ని పెట్టవలసిన అవసరమేముంది! ఇదంతా సన్యాసులు వ్యాపింపజేసిన విషయాలు, వారు తమను తాము బ్రహ్మ జ్ఞానులుగా, తత్వ జ్ఞానులుగా చెప్పుకుంటారు. శివుని గురించి అసలు వారికి తెలియనే తెలియదు. బ్రహ్మ తత్వము కేవలం నివసించే స్థానము మాత్రమే. వారు బ్రహ్మమును మరియు తత్వమును ఒకటిగా భావించరు. అచ్ఛా, వారు బ్రహ్మ జ్ఞానులు, తత్వ జ్ఞానులు అయినప్పుడు మరి స్వయాన్ని శివునిగా ఎందుకు పిలుచుకుంటారు? వారు శివుడూ బ్రహ్మమూ ఒక్కటే అని భావిస్తారు. ఒకవేళ ఒక్కరే అయితే మరి మూడు పేర్లు వేరు-వేరుగా ఎందుకు ఉన్నాయి? శివునికి లింగరూపములో పూజ జరుగుతుంది. బ్రహ్మముకు లేక తత్వముకు పూజ ఏ రూపములో చూపించారు? అది కేవలం నివసించే స్థానము మాత్రమే. మనుష్యులు చాలా తికమక చెంది ఉన్నారు. పిల్లలైన మీరు ఇప్పుడు చురుకైనవారిగా అవ్వాలి. సన్యాసుల నుండి కూడా ఎవరైనా వెలువడుతారు, ఎవరైతే నిజానికి దేవీ-దేవతా ధర్మానికి చెందినవారు ఉంటారో, వారు వెంటనే ఈ జ్ఞానాన్ని తీసుకుంటారు. ఎవరైనా 3-4 జన్మల నుండి కన్వర్ట్ అయి ఉంటే వారు అంత త్వరగా వెలువడరు. ఇప్పుడిప్పుడే వెళ్ళి ఉంటే వారు వెంటనే వచ్చేస్తారు. తండ్రిలో ఆ ఆకర్షణ ఉంది కదా. ఆత్మలు సూదుల వంటివి, బాబా అయస్కాంతము. ఇప్పుడు సూదులపై తుప్పు పట్టి ఉంది. తుప్పు పట్టిన సూది పైకి ఎలా వెళ్ళగలదు. తుప్పు పట్టిన వస్తువును కిరోసిన్లో వేస్తారు. బాబా ఈ జ్ఞానామృతం ద్వారా అందరి తుప్పునూ తొలగిస్తారు, అప్పుడు మనము సత్యమైన బంగారముగా అవుతాము. మీరు రాతినాథుల నుండి ఇప్పుడు పారసనాథులుగా అవుతారు. భారత్ పారసపురిగా ఉండేది. ఇప్పుడు బంగారము విలువ ఎంతగా పెరిగిపోయింది. ఆ తర్వాత అక్కడ చాలా చవకగా అవుతుంది. ఇప్పుడు ఈ భారత్ రాతిపురిగా అయ్యింది. తర్వాత పారసపురిగా అవుతుంది. మన బుద్ధిలో ఆ చక్రము తిరుగుతూ ఉంటుంది. రోజంతా చక్రము బుద్ధిలో తిరుగుతూ ఉంటేనే చక్రవర్తీ రాజు-రాణులుగా అవుతారు. ప్రపంచములో ఈ విషయాల గురించి ఎవ్వరికీ తెలియదు. మీకు తెలుసు, సత్యయుగములో ఎవరైతే రాజ్యం చేస్తారో, వారికి 84 జన్మలు ఉంటాయి, తర్వాత త్రేతాయుగము వారికి తప్పకుండా తక్కువ జన్మలే ఉంటాయి. 84 జన్మలు ఎక్కడ, కానీ 84 లక్షల జన్మలు అన్నట్లు చూపిస్తారు. అలాగైతే కల్పము కూడా అంత పెద్దగా ఉండాలి, అప్పుడే ఇన్ని జన్మలు ఉండగలవు. అన్నీ ప్రగల్భాలే. ఎల్లప్పుడూ మొదట చిత్రాన్ని వారి ఎదురుగా ఉంచాలి. మీరు ఎప్పుడూ ధనం అడగకూడదు. మీ పని వారికి ఇవ్వడము. వారు ఏదైనా ఇవ్వవలసి ఉంటే తమకు తాముగానే ఇస్తారు. వీటి ఖరీదు ఎంత అని ఎవరైనా అడిగితే ఇలా చెప్పండి - బాబా పేదలపాలిటి పెన్నిధి, పేదల కొరకైతే ఇవి ఉచితము, ఇకపోతే షావుకార్లు ఎంత ఇస్తే అంతగా మేము ఇంకా ఎక్కువ ముద్రిస్తాము, ధనాన్ని మేమేమీ మా కోసము వినియోగించము, ఏదైతే లభిస్తుందో దానిని ఇతరుల కోసమే ఉపయోగించడం జరుగుతుంది. షావుకారులే ధర్మశాలలు మొదలైనవాటిని తయారుచేస్తారు కదా. అయితే, పేదలు కూడా తయారుచేయవచ్చు, ఇందులో ఖర్చు ఏమీ లేదు. కకోడ్ గ్రామానికి చెందిన మాత - నేను సెంటర్ తెరుస్తాను అని అన్నారు. ఇటువంటి ఈశ్వరీయ విశ్వవిద్యాలయములో ముగ్గురు-నలుగురు మంచి పదవిని పొందినా అది అహో సౌభాగ్యమే. ఇందులో ఉదారచిత్తులుగా ఉండాలి. బాబా ఎంత ఉదారచిత్తులుగా ఉన్నారో చూడండి. వారు పనికిరానివి తీసుకొని రాజ్యాధికారాన్ని ఇస్తారు. సుపుత్రులైన పిల్లలే బాబా సేవను చేయగలుగుతారు. కుపుత్రులు ఏమి చేస్తారు. కుపుత్రులకు తండ్రి వారసత్వాన్ని ఇస్తారా. మీరు కూడా సద్గురువును ప్రత్యక్షము చేయాలి. కామము లేక క్రోధములోకి వచ్చినట్లయితే సద్గురువును నింద చేయించినట్లే, అప్పుడు ఇక పదవిని పొందలేరు. చాలా సంభాళించుకోవాలి.

మీరు అన్ని ధర్మాలవారికి అర్థం చేయించాలి. ముసల్మానులకు కూడా అర్థం చేయించండి - మీరు ఖుదాను ఆరాధిస్తున్నారు కావున మీరు తప్పకుండా వారి భక్తులే. మరి ఖుదా ఎక్కడ ఉన్నారు? ఖుదాయే రచయిత మరియు రచనల జ్ఞానాన్ని తెలియచేయగలరు. వారు శాంతిధామంలో ఉంటారు. వారిని స్మృతి చేస్తూ ఉన్నట్లయితే మీరు శాంతి వారసత్వాన్ని తీసుకోవచ్చు. వారసత్వాన్ని తీసుకుంటూ-తీసుకుంటూ వికర్మలు వినాశనమవుతాయి మరియు మీరు ఆ ఖుదా వద్దకు వెళ్ళిపోతారు. ఈ జ్ఞానము అన్ని ధర్మాల కొరకు ఉంది. ఇది పూర్తిగా కొత్త విషయము. జ్ఞానంతో మీ నావ తీరానికి చేరుకుంటుంది, ఇంకెక్కడికీ వెళ్ళవలసిన అవసరమే ఉండదు. కావున మధురమైన పిల్లలూ, ఇప్పుడు మీరు స్వర్గములోకి వెళ్తారు కావున పవిత్రులుగా తప్పకుండా అవ్వాలి. చూడండి, భారత్ లో పవిత్రత లేని కారణంగా

ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు, ఎన్ని హంగామాలు జరుగుతున్నాయి. గాంధీ ఏదైతే నేర్పించి వెళ్ళారో దానిని ప్రజలు అనుసరిస్తున్నారు. ఉద్యోగస్తులు, శ్రామికులు, డ్రైవర్లు మొదలైనవారు సమ్మె చేస్తే ప్రభుత్వానికి ఊపిరి ఆడకుండా చేసేస్తారు. ఇంత ఖర్చును మేము ఎక్కడి నుండి తీసుకువస్తాము అని ప్రభుత్వం వారికి స్పష్టంగా చెప్తుంది. అప్పుడు వారు అంటారు - మీరైతే ఎంతో సుఖపడుతూ ఉంటారు, మొత్తం ధనాన్ని భోగు చేసుకుంటూ ఉంటారు, మేమేమి తప్పు చేసాము, మాకు జీతాలు కావాలి అని అంటారు. వారు సమ్మె చేస్తే వ్యాపారం నిలిచిపోతుంది. ఇవన్నీ జరుగవలసిందే. కొన్ని చోట్ల ధాన్యము, కూరగాయలు దొరకవు, పాలు కూడా దొరకవు. ఎక్కడికక్కడ గొడవలు ఉంటాయి. ఈ గొడవలన్నీ జరిగి శాంతి ఏర్పడుతుంది. అర్జునుడికి వినాశనము మరియు విష్ణుపురి యొక్క సాక్షాత్కారము చేయించారు కదా. మీకు కూడా ఇప్పుడు కలుగుతోంది. మీరు ఎంత ప్రియమైన పిల్లలో చూడండి. అనేక జన్మల అంతిమములో వచ్చి కలుసుకున్నారు కావున పూర్తి సౌభాగ్యమును తీసుకోండి.

(వర్షం చాలా తీవ్రంగా కురుస్తోంది) చూడండి, బాబా కురిపించిన జ్ఞాన వర్షము కూడా ఎంతో కురిసింది, అలాగే ఆ వర్షము కూడా ఎంతో కురిసింది. వర్షాల కొరకు కూడా యజ్ఞాలను రచిస్తారు, అలాగే శాంతి కొరకు కూడా యజ్ఞాలను రచిస్తారు, కానీ శాంతి స్వరూపుడైతే ఒక్క భగవంతుడే. వారు వచ్చినప్పుడు శాంతి యొక్క జ్ఞానాన్ని ఇస్తారు. ఇచ్చేవారు వారే కదా. మంచి పిల్లలను టోల్ పుట్ (మధురమైన పిల్లలు) అని అంటారు. వారికి మిఠాయిలు తినిపించడం జరుగుతుంది. అవి స్థూలమైన మిఠాయిలు, ఇవి ఆత్మిక మిఠాయిలు, వీటిని ఆత్మిక తండ్రి ఇస్తారు. దేహీ-అభిమానులుగా ఉండడము పెద్ద లక్ష్యము, ఇందులో శ్రమ ఉంది. బాబా అంటారు, 8 గంటలు దేహీ-అభిమానులుగా అవ్వండి, ఆ తర్వాత శరీర నిర్వహణార్థము కర్మలు కూడా చేయండి. రాత్రి వేళలో మేల్కొన్నట్లయితే చాలా మంచి లగనము ఏర్పడుతుంది. ఇది సంపాదన కదా. ఓ నిద్రను జయించే పిల్లలూ, నన్ను శ్వాస-శ్వాసలోనూ స్మృతి చేయండి. విచార సాగర మంథనము చేయండి. రాత్రింబవళ్ళు ఎంతగా యోగములో ఉంటారో అంతగా వికర్మలు వినాశనమవుతాయి. ఎంతెంతగా జ్ఞానాన్ని స్మరిస్తూ ఉంటారో, అంతగా సంపాదన జరుగుతుంది. ఇకపోతే సేవ అయితే ఎంతో ఉంది. బాబాను అడిగితే - కూర్చొని ఉండండి, విశ్రాంతి తీసుకోండి... అని అంటారు. ఇందులో అడగవలసిన అవసరమే లేదు. బాబా ఏమైనా లోక-మర్యాదలు, కుల-మర్యాదల గురించి ఆలోచించారా! అరే, విశ్వ రాజ్యాధికారము లభిస్తుంది. ఇకపోతే ప్రతి ఒక్కరిదీ తమ-తమ పాత్ర. అందుకే బాబాను అడగాలి. ప్రతి ఒక్కరూ స్వయం కొరకు సలహాలను అడగాలి ఎందుకంటే ప్రతి ఒక్కరి కర్మబంధనాలూ వేర్వేరు. ధనం ఉంటే అలౌకిక సేవలో సఫలం చేయాలి. పిల్లలు మహావీరులుగా అవ్వాలి. నాకు ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ లేరు అన్న గాయనము కూడా ఉంది. వారే అందరికీ తండ్రి. శివబాబా అంటారు, నేను అందరినీ తిరిగి తీసుకువెళ్ళేందుకు వచ్చాను. తండ్రి అంటారు, ఈ ప్రపంచములో మనుష్యమాత్రులు ఒక్కరు కూడా త్రికాలదర్శులుగా, ఆస్తికులుగా లేరు. అందరూ నాస్తికులే, తండ్రి గురించి తెలియనివారే. ఇకపోతే రిద్ధి-సిద్ధులు కలవారు ఎంతోమంది ఉన్నారు. మాయ కూడా తక్కువేమీ కాదు, ఈ మాయ పైనే విజయం పొందాలి, అందుకే కవచము ధరించి ఉండాలి. కవచము అంటే అర్థము మన్మనాభవ. శివబాబాను స్మృతి చేయండి, దేహీ-అభిమానులుగా అవ్వండి. ఈ అంతిమ జన్మలోనే మీరు ఒక్క సారే దేహీ-అభిమానులుగా అవుతారు. ఆ తర్వాత సత్యయుగము నుండి కలియుగము వరకు ఈ దేహీ-అభిమానిగా అయ్యే శిక్షణను ఇంకెవ్వరూ ఇవ్వరు. ఈ సమయములోనే దేహీ-అభిమానులుగా అవ్వవలసి ఉంటుంది ఎందుకంటే ఇప్పుడు శరీరాన్ని వదిలి నా వద్దకు రావాలి. దేవతలు దేహీ-అభిమానులుగా ఎందుకు అవ్వాలి, వారు తిరిగి వెళ్ళేది లేదు. ఈ జ్ఞానం మీకు ఇప్పుడే లభిస్తుంది. మీరు అశరీరిగా ఉండేవారు, తర్వాత ఈ శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయించారు, ఇప్పుడు మళ్ళీ శరీరాన్ని వదిలి తిరిగి వెళ్ళాలి. మీ అవస్థను తయారుచేసుకోవాలి. మాయపై విజయాన్ని పొందాలి. గృహస్థ వ్యవహారములోనైతే ఉండవలసిందే. హంస మరియు కొంగ కలిసి ఉంటే విఘ్నాలు కలుగుతాయి. అసురుల అత్యాచారాలను కూడా ఎంతగానో సహించవలసి ఉంటుంది. ఇంట్లో కూర్చొని ప్రమాణము చేస్తారు - బాబా, ఏమి జరిగినా సరే, మేము మీ నుండి వారసత్వాన్ని తప్పకుండా తీసుకుంటాము. ఎన్ని దెబ్బలు తింటారు. డ్రామా అనుసారంగా ఈ పాత్ర కల్పపూర్వము కూడా జరిగింది. ఎవరైతే ఎన్నో అత్యాచారాలను సహిస్తారో, వారే సౌభాగ్యశాలులు. ఎంతైనా వచ్చి కలుసుకున్నారు కదా! వారి ప్రారబ్ధమైతే తయారైంది కదా. అయితే, ఇందులో శ్రమ ఉంది, అసురుల నుండి దేవతలుగా అవ్వాలి. ఎప్పటివరకైతే జీవిస్తారో, అప్పటివరకూ జ్ఞానామృతాన్ని తాగవలసిందే. బాబా కొత్త-కొత్త విషయాలను అర్థం చేయిస్తూ ఉంటారు. యుక్తులు తెలియజేస్తూ ఉంటారు. దీనిని విచార సాగర మంథనము అని అంటారు. బుద్ధిలో మంథనము జరుగుతూ ఉండాలి. రాత్రి కూడా శివబాబాను స్మృతి చేసి నిదురపోండి, సేవ యొక్క అభిరుచి ఉంటే వారికి నిద్ర వస్తుందా. ఈ పాయింట్ గురించి ఏమేమి అర్థం చేయించాలి అన్న ఆలోచన నడుస్తూ ఉంటుంది. జ్ఞానాన్ని లోపల బాగా నెమరు వేయాలి. ఎప్పుడైతే జ్ఞానాన్ని అరగదీస్తారో, అప్పుడే రాజ్య తిలకాన్ని తీసుకునేందుకు యోగ్యులుగా

అవుతారు. ఎంతో చురుకైన పిల్లలు ఎవరైతే ఉంటారో, వారిని ఫాలో చేయాలి. ఇది చాలా అద్భుతమైన సంపాదన. ఎవరి వద్దనైతే లక్షలు, కోట్లు ఉంటాయో, వారంతా అంతమైపోతారు. ఇంకాస్త సమయములో ఏమి జరుగుతుందో చూడండి. అప్పుడు మనుష్యులు మేల్కొంటారు. యుద్ధాలు మొదలైనవాటి రిహార్సల్స్ జరుగుతూ ఉంటాయి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఏ వస్తువు పట్ల అభిరుచిని ఉంచుకోకూడదు. దేహీ-అభిమానులుగా ఉండాలి. స్మృతి అనే కవచమును సదా ధరించి ఉండాలి.

2. నిద్రను జయించి శ్వాస-శ్వాసలోనూ తండ్రిని స్మృతి చేయాలి, జ్ఞానాన్ని స్మరించి సంపాదనను జమ చేసుకోవాలి. బుద్ధిలో మంథనము జరగాలి.

వరదానము:- సర్వశక్తివంతుని తోడు యొక్క అనుభూతి ద్వారా సర్వ ప్రాప్తులను అనుభవం చేసే తృప్త ఆత్మా భవ

ఎక్కడైతే సర్వశక్తివంతుడైన తండ్రి ఉంటారో, అక్కడ సర్వ ప్రాప్తుల అనుభవము స్వతహాగా కలుగుతుంది. ఏ విధంగా బీజము లోపల వృక్షము ఇమిడి ఉంటుందో, అలాగే సర్వశక్తివంతుడైన తండ్రి తోడు ఉన్నట్లయితే సదా సుసంపన్నులుగా, సదా తృప్తిగా, సదా సంపన్నంగా ఉంటారు, ఎప్పుడూ ఏ విషయంలోనూ బలహీనంగా ఉండరు, ఎప్పుడూ ఎటువంటి ఫిర్యాదు చేయరు, సదా కంప్లీట్ గా ఉంటారు. ఏం చేయాలి, ఎలా చేయాలి... అన్న ఫిర్యాదులు ఉండవు. ‘ఎందుకు’ అన్న క్యూ సమాప్తమైపోతుంది. ఎవరైతే సదా తోడుగా ఉంటారో, వారు తోడుగానే వెళ్తారు.

స్లోగన్:- ఏ విధంగా నయనాలలో కనుపాప ఇమిడి ఉంటుందో, అలాగే బుద్ధిలో శివబాబా స్మృతి ఇమిడి ఉండాలి.